క్లుప్తంగా

నేటి నుంచి శరన్నవరాత్రోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరి

దొర్నిపాడు:మండల కేంద్రంలో ఈనెల 15వ తేదీ నుంచి కన్యకా పరమేశ్వరి ఆలయంలో దసరా శరన్నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రామసుబ్బయ్య శనివారం తెలిపారు. 15న శ్రీరాజరాజేశ్వరి దేవి, 16న అన్నపూర్ణాదేవి, 17న ధనలక్ష్మి , 18న గాయత్రీదేవి, 19న లలితాదేవి, 20న సరస్వతీ దేవి, 21న బాలత్రిపురసుందరీ, 22న దుర్గాదేవి, 23న విజయలక్ష్మిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని చెప్పారు. 24న వసంతోత్సంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

శిరివెళ్ల: ఈ నెల 15వ తేదీ నుంచి దేవీ శరన్నవరాత్రులు ప్రారంభమవుతాయని స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయ అధ్యక్షుడు వంకదార ఈశ్వరయ్య శనివారం తెలిపారు. 15న వరలక్ష్మీదేవి అలంకారం, 16న వైష్ణవిదేవీ, 17న లలితాదేవి, 18న అన్నపూర్ణాదేవి, 19న ధనలక్ష్మీదేవి, 20న సరస్వతీదేవి, 21న దుర్గాదేవి ,22న రాజరాజేశ్వరీ, మహిషాసురమర్ధిని, 23న వాసవీ కన్యకా పరమేశ్వరిగా దర్శనమిస్తారని వివరించారు.

విజయవంతం చేయండి

ఉయ్యాలవాడ : ఈనెల 29వ తేదీన నిర్వహించే చలో గుంటూరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉయ్యాలవాడ దూదేకుల సంఘం నాయకులు దస్తగిరిబాబు, అబ్దుల్లా, మధు కోరారు. శనివారం మండల కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ..నూర్‌బాషా(దూదేకుల)లు ఐక్యతతో చట్టసభల్లో స్థానం సంపాదించుకునేందుకు కృషి చేద్దామన్నారు. సదస్సుకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కోట్లో బాబు, లాలమ్మగారి దస్తగిరి పాల్గొన్నారు.

బిల్లులు వసూలు చేయాలి

గోస్పాడు: వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలు చేయాలని ఏఈ జ్ఞానసూర్యుడు తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో బిల్లుల చెల్లింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మీటరు లేకుండా విద్యుత్ వినియోగిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోస్పాడు: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాల్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మురుగు నీటి వల్ల దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని, గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. ప్రజలు కాచి వడబోసిన నీటినే తాగాలని, అనారోగ్యం తలెత్తితే ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స చేయించుకోవాలని చెప్పారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని మదర్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఏటువన్ మూమెంట్ ఇండియా సౌజన్యంతో గ్రామ జ్యోతి సొసైటీ సూచనల మేరకు వాక్ ఫర్ ఫ్రీడమ్, మానవ అక్రమ రవాణా కార్యక్రమాన్ని శనివారం ప్రభుత్వ బాలికల కాలేజీ ఆవరణలో అధ్యక్షుడు మేడిద రామారావు ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా జీవితాలను నాశనం చేస్తుందని అన్నారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ చింతామణి విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, అధ్యాపకులు అరుణ్‌కుమార్, నాగేశ్వరరావు, గోవర్ధన్, లక్ష్మిరంగ, వలంటీర్లు పాల్గొన్నారు.

స్పందన సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

నంద్యాల(సిటీ): పట్టణంలోని వార్డు సచివాలయాలకు స్పందన కార్యక్రమంలో భాగంగా వస్తున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్ మున్సిపల్, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక కార్యాలయంలో స్పందన కార్యక్రమం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమస్యలను వెంటనే పరిష్కరించి వాటికి మున్సిపల్ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన సమస్యలు అధికంగా వస్తున్నాయని, ఆ విభాగంపై ప్రత్యేక దృష్టి సారించి ఆక్రమణలు, ఎన్‌క్రోచ్‌మెంట్‌లను ముందస్తుగా గుర్తించి చర్యలు చేపట్టాలని సూచించారు. క్లాప్ యూజర్ చార్జ్, ప్రాపర్టీ, వాటర్ పన్నుల వసూళ్లలో అలసత్వం తగదన్నారు.

అభివృద్ధి పథంలో మహదేవపురం

శిరివెళ్ల: గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం చర్యలు చేపట్టడంతో పల్లెలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయి. మండలంలోని మహదేవపురం గ్రామంలో వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో పనులు పూర్తయ్యాయి. గ్రామం నల్లమల అడవికి సమీపంలో ఉండటంతో నాలుగేళ్ల క్రితం వరకు గత పాలకులు పట్టించుకోలేదు. దీంతో గ్రామంలో అభివృద్ధికి దూరంగా నిలిచి పోయింది. కనీస వసతులు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందుల మధ్య జీవనం సాగించే వారు. పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి నిధులు మంజూరు చేయించడంతో వివిధ వసతుల కల్పన పనులు చేపట్టారు.

అభివృద్ధి పనులు ఇలా..

- మహానంది మండలం గాజులపల్లె- మహదేవపురం గ్రామం మధ్య వక్కిలేరు వాగుపై ఉన్న వంతెన శిథిలమవడంతో రాకపోకలకు అవస్థలు పడేవారు. వరదలు అధికం కావడంతో వంతెన కొట్టుకపోయింది. గ్రామస్తుల కోరిక మేరకు ప్రభుత్వం రూ. 3.10 కోట్లు విడుదల చేయడంతో హైలెవెల్ వంతెన ఏర్పాటు పూర్తయ్యింది.
- రూ.62 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు చేపట్టారు.
- గడప గడప నిధులు రూ. 20 లక్షలతో సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వలు ఏర్పాటు చేశారు.
- మన బడి నాడు- నేడు కింద రూ. కోటితో జెడ్పీ ఉన్నత పాఠశాల, రూ.15 లక్షలతో మెయిన్ ప్రాథమిక పాఠశాల, రూ.12 లక్షలతో ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలను సుందరంగా రూపుదిద్దారు.
- రూ. 6 లక్షలతో సచివాలయం, ఓసీ కాలనీలో మూడు సిమెంట్ రోడ్లు వేశారు.


గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం నిర్మించిన దృశ్యం


వక్కిలేరు వాగుపై నిర్మించిన హై లెవెల్ వంతెన


వీధుల్లో సిమెంట్ రోడ్డు

15 ఏళ్ల తరువాత సిమెంట్ రోడ్డు వేశారు



మా వీధిలో సీసీ రోడ్డు వేయాలని కోరిన 15 ఏళ్ల తర్వాత వేశారు. అంతకు ముందు మట్టి రోడ్డుతో ఇబ్బంది పడ్డాం. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేకు మా కాలనీ సమస్యలను వివరించాం. వెంటనే సిమెంట్ రోడ్డు వేశారు. ప్రస్తుతం రోడ్డు సమస్య తీరింది.

– లక్ష్మీదేవి

ఎమ్మెల్యే సహకారంతో పనులు



ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయి. ఇటీవల రూ. కోటి విలువైన పనులు చేశాం. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, నాడు-నేడు కింద పాఠశాలలు, సిమెంట్ రోడ్లు వేశాం. ఇంకా 40 శాతం రోడ్లు వేయాల్సి ఉంది. 45 శాతం మురుగు కాల్వల నిర్మాణాలు జరిగాయి. వంద శాతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. త్వరలో పూర్తి చేస్తాం.

– పెద్ది రమణయ్య, సర్పంచ్

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

రుద్రవరం: మండలంలోని వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ,గోదా సమేత వాసపురం వేంకటేశ్వర స్వామి వారికి శనివారం భక్తులు విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు గోపీ శర్మ, శివ ఉదయాన్నే స్వామి,అమ్మవార్లకు నిత్య పూజల అనంతరం ప్రత్యేక అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు.అలాగే చిత్తూరు జిల్లా ఏర్పేడు గ్రామ వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి వారిని దర్శించుకుని భక్తులకు భగవద్గీత ప్రవచానాలను వినిపించారు.

శ్రీ బరకసంజీవరాయుడికి ప్రత్యేక పూజలు

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరకసంజీవరాయ స్వామికి శనివారం అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ, మన్యసూక్త హోమం, పల్లకీసేవా తదితర విశేష పూజలను నరహరి శర్మ, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. బీకే సింగ్ అండ్ బిల్డర్స్, అగ్రసేని హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పేరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిన్న చెరువు పనులు పూర్తి చేయండి


వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, చిత్రంలో ఎస్పీ రఘువీర్ రెడ్డి

నంద్యాల(సెంట్రల్): పట్టణం సమీపంలోనున్న చిన్న చెరువు వద్ద గ్రీన్‌కో సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను దసరా లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. శనివారం చెరువు వద్ద టూరిస్ట్ రెస్టారెంట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎస్పీ రఘువీర్ రెడ్డి, జిల్లా పర్యాటక శాఖాధికారి సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. రెస్టారెంట్ భవన పునర్నిర్మాణ పనులు, చిన్నారులకు క్రీడా పరికరాలు, జిమ్, ల్యాండ్ స్కేపింగ్, వాకింగ్ ట్రాక్, ఇనుప రక్షణ కంచె, బోటింగ్‌కు సిద్ధం చేస్తున్న మోటారు బోట్లు, పెడల్ బోట్లు, ఆహారశాలలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే లక్ష్యంతో చేపట్టిన పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. పనుల పురోగతిపై పర్యాటక శాఖాధికారి సత్యనారాయణ కలెక్టర్‌కు నివేదించారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేశ్వరరెడ్డి, గ్రీన్‌కో సంస్థ ప్రతినిధి శ్రీనివాసనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


అమరసాని కృష్ణ (ఫైల్)

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండలం కంపమల్ల మెట్ట సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ మౌలానీ అందించిన సమాచారం మేరకు.. దొర్నిపాడుకు చెందిన యువకుడు అమరసాని కృష్ణ(27) సొంత పనుల నిమిత్తం డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి బైక్‌పై వెళ్లి స్వగ్రామానికి బయలదేరాడు. కంపమల్ల సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు కల్వర్టును ఢీకొట్టాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాద వివరాలపై ఆరా తీస్తున్నారు. మృతునికి భార్య జ్యోతి, కుమారుడు రుత్విక్ రాయల్, కుమార్తె శరణ్య ఉన్నారు. ఇదిలా ఉండగా మృతి చెందిన యువకుడి తండ్రి అమరసాని నారాయణ పదిహేను రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. పదిహేను రోజుల వ్యవధిలో తండ్రి, కుమారుడు మృత్యువాత పడటంతో ఆ కుటుంబంలో విషాద చాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



ట్యాంకర్‌ను తొలగించరూ!

నంద్యాల(సిటీ): పట్టణంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. అయితే పనులు చేసే క్రమంలో కొందరి నిర్లక్ష్యం కారణంగా ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంజీవనగర్ గేట్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మాణం పనులు సాగుతున్నాయి. నిర్మాణంలో భాగంగా డివైడర్ క్యూరింగ్ కోసం నీళ్లు పట్టడానికి ట్యాంకర్‌ను ఏర్పాటు చేశారు. అయితే కొద్ది రోజులుగా ట్యాంకర్‌ను రోడ్డుపైనే వదిలేయడంతో రాకపోకల సమయంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పనులు చేస్తున్న చోట సూచికలు ఏర్పాటు చేసి, నీటి ట్యాంకర్‌ను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.


నంది విగ్రహం వద్ద విద్యార్థుల సందడి

మహానందిలో వీకెండ్ సందడి

మహానంది: మహానంది ఆలయంలో శనివారం వీకెండ్ సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల భక్తులతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. దసరా సెలవులు కావడంతో తెలంగాణలోని హైదరాబాద్ నుంచి అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు, విద్యార్థులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం విద్యార్థులు ఆలయ ప్రాంగణంలోని నంది విగ్రహం వద్ద సందడి చేస్తూ ఫొటోలు తీసుకుంటూ ఆనందించారు.

నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


విద్యుద్దీపాల అలంకరణలో కాళికాంబ దేవాలయం




వేడుకలకు ముస్తాబైన బ్రహ్మనందీశ్వరస్వామి దేవాలయం


కల్పనా సెంటర్ రామాలయాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

- 9రోజుల పాటు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు
- ప్రతి రోజు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్న అమ్మవార్లు
- విద్యుద్దీపాల కాంతులతో వెలుగులీనుతున్న ఆలయాలు

నంద్యాల(వ్యవసాయం): నందుల కోట.. నంద్యాలలో వెలసిన ఆలయాల్లో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రుల వేడుకలను నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే దేవాలయాలను విద్యుత్ దీపాలతో విశేషంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కాల్పించారు. శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానం, బ్రహ్మనందీశ్వరస్వామి దేవస్థానం, మల్లికార్జునస్వామి దేవస్థానం, శ్రీరమా సమేత సత్యనారాయణస్వామి దేవాలయాలు నందుల చక్రవర్తి కాలంలో నిర్మించబడి ఇప్పటి వరకు దసరా శరన్నవరాత్రుల వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీ జగజ్జననీ దేవాలయం, మెయిన్ బజార్‌లో వెలసిన కన్యకాపరమేశ్వరి దేవాలయం, శ్రీకృష్ణ భజనమందిరం దేవాలయాల్లో స్వామి, అమ్మవార్లకు ఉదయం సుప్రభాత సేవలు, పంచామృతాభిషేకాలు, విశేషపూజలు, హోమాలు, లలితా సహస్ర నామాలు, హోమాలు, వేదపఠనాలు, మహానైవేద్యాలు, మహామంగళ హారుతులు, సాయంత్రం ప్రదోషకాల పూజలు, అమ్మవారిని వివిధ రూపాల్లో 9రోజుల పాటు ప్రత్యేక మండపాల్లో అలంకరించి సాయంత్రం వేళల్లో స్వామి, అమ్మవార్లను వివిధ రకాల వాహనసేవల ద్వారా గ్రామోత్సవం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

'బీజేపీ విధానాలను తిప్పికొట్టాలి'

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నీటిని పునః పంపిణీ పేరుతో రాష్ట్రానికి నష్టం కలిగించే బీజేపీ విధానాలను తిప్పి కొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరా. శనివారం స్థానిక కార్యాలయంలో కృష్ణా జలాల పునః పంపిణీ చేస్తూ నోటిఫికేషన్ విడుదల, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్, రాయలసీమపై ప్రభావం అనే అంశంపై ఈనెల 18వ తేదీన కడపలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అడ్డగోలు నిర్ణయాలతో అందలం ఎక్కాలని చూస్తుందని విమర్శించారు. కడపలో జరిగే సదస్సుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్, తులసిరెడ్డి, బొజ్జా దశరథరామిరెడ్డి, ఓబులేసు, ఈశ్వరయ్య, రామచంద్రయ్య, హరినాథరెడ్డి, జగదీష్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు. సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, సోమన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపీఠారోహణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల పుణ్యక్షేత్రంలో అమ్మ నీదయ ఆశ్రమ ట్రస్ట్ పీఠాధిపతిగా అశోక్ గురూజీ గురుపీఠారోహణ కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రీశైలం కొత్తపేట సమీపంలోని అమ్మా నీదయ ఆశ్రమంలో అధ్యక్షుడు నర్సిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా ప్రత్యేక హోమాది కార్యక్రమాలను నిర్వహించి, పంచద్రవ్య ప్రాశన చేసి, గురు పూజ కార్యక్రమాలు జరిపించారు.

తల్లిపై కత్తితో కొడుకు దాడి

డోన్ టౌన్ : పట్టణంలోని తారకరామ నగర్‌కు చెందిన ఎరుకలి మద్దమ్మపై శనివారం రాత్రి కుమారుడు సురేష్ తాగిన మైకంలో కత్తితో దాడి చేశాడు. మద్యానికి భానిసైన సురేష్ తరుచూ తల్లితో గొడవ పడుతూ ఉండేవాడు. ఈ కోవలోనే శనివారం మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని తల్లితో గొడవ పెట్టుకున్నాడు. తల్లి డబ్బులు ఇవ్వకపోవడంతో క్షణికావేశానికి గురైన కుమారుడు ఇంట్లో ఉన్న కత్తితో దాడి చేశాడు. అయితే తల్లి చేతులు అడ్డుపెట్టుకోవడంతో గాయాలయ్యాయి. స్థానికులు డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మద్దమ్మను కర్నూలు వైద్యశాలకు తరలించినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

పోతిరెడ్డిపాడు నుంచి కొనసాగుతున్న నీటిసరఫరా


పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ఐదు గేట్ల ద్వారా ఎస్సార్‌ఎమ్సీ కాల్వలోకి వెళ్తున్న నీరు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ఐదుగేట్ల ద్వారా 1,500 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం జలాశయంలో సాయంత్రం ఆరుగంటల సమయంలో 848.80 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద 847.80 అడుగులుగా ఉందని చెప్పారు. హెడ్‌రెగ్యులేటర్ ఐదుగేట్ల ద్వారా 1,500 క్యూసెక్కుల నీరు ఎస్సారెమ్సీ కాల్వలోకి వెళ్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటిని యంత్రణ వ్యవస్థ నుంచి గాలేరునగరి సుజలస్రవంతి (ఎస్సార్బీసీ)కాల్వకు 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెలుగుగంగ, కేసీ ఎస్కేప్ కాల్వకు సాగునీటి సరఫరా నిలిపివేసినట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు.

21.1861టీఎంసీల నీటి వినియోగం

ఇప్పటిదాకా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా కేవలం 21.1861టీఎంసీల నీటిని మాత్రమే దిగువనున్న ఆయకట్టుకు వినియోగించుకున్నట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. ఇందులో తెలుగు గంగ కాల్వకు 10.5236టీఎంసీలు, కేసీఎస్కేప్ కాల్వకు 2.1423 టీఎంసీలు, ఎస్సార్బీసీకి 8.5202 టీఎంసీల నీటిని సరఫరా చేసినట్లు వెల్లడించారు.

భవన నిర్మాణాలను ప్రారంభించండి


ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణానికి మంజూరు చేసిన నూతన భవనాల నిర్మాణాలను ప్రారంభించాలని ఆల్ మేవా నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఇమ్రాన్ పాషా ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాను కోరారు. ఈ మేరకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఇమ్రాన్ పాషా మాట్లాడుతూ.. ఉర్దూ కళాశాల, హాస్టల్, కమ్యూనిటీ హాల్, విద్యార్థినుల, బాలికల హాస్టళ్ల నిర్మాణానికి పీఎంజేవీకే కింద కేంద్ర ప్రభుత్వం నంద్యాలకు నిధులు మంజూరు చేసింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం వీటి నిర్మాణానికి అవసరమైన నాలుగున్నర ఎకరాల స్థలాన్ని కేటాయించిందని చెప్పారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి ఇప్పటికే రెండు బోర్లు వేయించామని, మరో వారం రోజుల్లో పనులను ప్రారంభిస్తామని తెలిపారు.కార్యక్రమంలో నంద్యాల జిల్లా గౌరవాధ్యక్షులు ఎండీ అబులైజ్, ప్రధాన కార్యదర్శి సలీం, కార్యవర్గ సభ్యులు మునీర్, జాకీర్, లాయర్ మదానీ పాల్గొన్నారు.